సాక్షి
పెద్దపల్లి
మంగళవారం । 8 । ఆగస్టు । 2023



పేదింటి పిల్లలు.. ఖాకీ కొలువులు

8లో▸

పేదింటి పిల్లలు ఖాకీ కొలువులు సాధించారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో అత్యుత్తమ మార్కులతో సత్తాచాటారు.



ఉద్యోగావకాశం కల్పించండి

కమాన్‌పూర్: తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగావకాశం కల్పించాలని ఉద్యమ కళాకారులు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. దుబాసి శ్రీనివాస్, పులిపాక బానయ్య, గాజుల రమేశ్ ఉన్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లావ్యాప్తంగా పొడి వాతావరణం ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని: స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ కోరారు. తన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మాట్లాడారు. పంద్రాగస్టు వేడుకలను యైటింక్లయిన్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌ఓటూ జీఎం అబ్దుల్ సలీం, ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏరియా రక్షణ అధికారి బి.రవీందర్, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, ఫైనాన్స్ డీజీఎం వెంకటరామచంద్ర, రెస్క్యూ సూపరింటెండెంట్ మాధవరావు, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్

పాలకుర్తి: బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల టోల్‌ప్లాజా ఉద్యోగులకు సోమవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. బసంత్‌నగర్, పుట్నూర్ వైద్యులు సరళి, సాయిసూర్య, ఎస్సై వెంకటేశ్ పాల్గొని గుండెపోటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన చికిత్సపై వివరించారు. బసంత్‌నగర్ ఠాణా రెండో ఎస్సై గంగరాజగౌడ్, బసంత్‌నగర్ పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ దేవాంజలి, టోల్‌ప్లాజా డిప్యూటీ పీఎం రామకృష్ణ, ఫేర్‌వేస్ పీఎం కన్నబాబు, పీఆర్‌ఓ హన్మకొండ రాములు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలు



మాట్లాడుతున్న నరేశ్

గోదావరిఖని టౌన్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రతి పోస్టాఫీసులో జాతీయ జెండాలు విక్రయించనున్నట్లు గోదావరిఖని పోస్టల్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ అరికాల నరేశ్ సోమవారం తెలిపారు. పోస్టాఫీస్‌లో లేదా పోస్టుమాస్టర్, పోస్టుమ్యాన్‌కు రూ.25 చెల్లించి జాతీయ జెండాలు తీసుకోవాలని సూచించారు. www.eposotffice.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 12వరకు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవచ్చని, వారికి పోస్టుమ్యాన్ ద్వారా నేరుగా ఇంటికి పంపిస్తామని వివరించారు. విద్యాలయాలు, కార్యాలయాలకు ఎక్కువ మొత్తంలో అవసరముంటే పోస్టాఫీసులో నేరుగా సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో వందశాతం ఉత్పత్తి సాధించాలి

- ఎరువులు, రసాయనాల శాఖ డైరెక్టర్ హరిహరప్రసాద్



ఆర్‌ఎఫ్‌సిఎల్ అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ హరిహర ప్రసాద్

ఫెర్టిలైజర్‌సిటీ: ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారాన్ని సోమవారం ఎరువులు మంత్రిత్వ శాఖ డైరెక్టర్ హరిహర ప్రసాద్ సందర్శించారు. కర్మాగారంలోని మెయిన్ కంట్రోల్, బ్యాగింగ్ యూనిట్, డిస్పాచ్ భాగాలను పరిశీలించారు. వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. 2023–24లో ప్లాంట్ సామర్థ్యం 12.70లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని కర్మాగారం అధిగవించాలని సూచించారు. ఎరువులను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో డిమాండ్‌కు తగినట్టుగా సరఫరా చేయాలని పేర్కొన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో కర్మాగారం రూ.86.52 కోట్ల ఆదాయాన్ని సంపాదించుకున్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం సుధీర్ కుమార్‌ఝా, ఉదయ్ రాజహంస పాల్గొన్నారు.

దెబ్బతిన్న పల్లెరోడ్లు



సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల మీదుగా మానేరు నదికి వెళ్లే రోడ్డు దుస్థితి

- భారీ వర్షాలకు ఉమ్మడి జిల్లాలో రహదారులు ధ్వంసం
- కరీంనగర్ జిల్లాలోనే ఎక్కువ
- నష్టం అంచనాలు రెడీచేసిన పీఆర్ విభాగం
- మరమ్మతులకు దాదాపు రూ.188 కోట్లు



కోతకు గురైన రోడ్డు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు ధ్వంసమయ్యాయి. మునుపెన్నడూ లేనిరీతిలో కురిసిన వర్షాలకు చాలాచోట్ల రోడ్లు కొట్టుకుపోయాయి. కల్వర్టులు ధ్వంసమయ్యాయి. వరద ఉధృతికి అనేక ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురయ్యాయి. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్లలో పంచాయతీరాజ్ రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. పెద్దపల్లి జిల్లాలో రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈమేరకు పంచాయతీరాజ్ అధికారులు నష్టతీవ్రతను అంచనా వేసేందుకు సబ్ డివిజన్లలో రోడ్ల పరిస్థితిపై సర్వే నిర్వహించారు. జూలై నెలాఖరు నాటికి ఈ రోడ్ల దయనీయ పరిస్థితిపై అధికారులు ఒక అంచనాకు వచ్చారు.

కరీంనగర్‌లో ఎక్కువ..

కరీంనగర్ రీజియన్‌లో పంచాయతీరాజ్ అధికారులు రోడ్ల నష్టంపై ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. దీని ప్రకారం.. కరీంనగర్‌లో గరిష్టంగా 406.77 కి.మీల రోడ్లు, జగిత్యాలలో 298.36 కి.మీల మేర, రాజన్న సిరిసిల్ల 124.43 కి.మీ, పెద్దపల్లిలో కనిష్టంగా 42.46 కి.మీ మేర రోడ్లు ఉన్నాయి. ఇందులో కరీంనగర్‌లో 163 కి.మీ, జగిత్యాలలో 1.90 కి.మీ మేర, పెద్దపల్లిలో 0.41 కిమీ పాటు, రాజన్నసిరిసిల్లలో 7.43 కి.మీ మేర దెబ్బతిన్నాయి. ఇందులో కొన్ని రోడ్లు రోడ్ల ఉపరితలం కొట్టుకుపోగా, కొన్నిచోట్ల కల్వర్టులు దెబ్బతిన్నాయి. మరికొన్ని చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. వీటికి వెంటనే మరమ్మతులు నిర్వహించాలని, అందుకు ఎంతమేరకు ఖర్చవుతుందన్న వివరాలపై అధికారులు తాత్కాలిక నివేదికను రూపొందించారని సమాచారం. దీని ప్రకారం.. జిల్లాలో మొత్తం మీద సుమారు 869 కి.మీలకుగాను 173.70 కి.మీ మేర రహదారులు దెబ్బతిన్నాయి.

రూ.188 కోట్లు కావాలి



కోతకు గురైన నీరుకుల్ల రోడ్డు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కరీంనగర్ రీజియన్‌లోని రహదారులకే తక్షణమే మరమ్మతులు అవసరం. వీటిని మరమ్మతులకు దాదాపు రూ.188.88 కోట్ల నిధులు అవసరమవుతాయని నివేదిక రూపొందించారు. ఈ ప్రతిపాదనలకు ఇంకా అధికారుల ఆమోద ముద్ర పడాల్సి ఉంది. ఆ తరువాత ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగానే.. టెండర్లు పిలిచి మరమ్మతులు ప్రారంభించనున్నారు. వర్షాలు కురిసిన సమయంలో వాగులు వంకలు ఆనుకుని ఉన్నగ్రామాల్లో రెండు మూడురోజులపాటు రాకపోకలు స్తంభించాయి. ఇలాంటి గ్రామాలకు మరమ్మతుల్లో తొలిప్రాధాన్యం ఇవ్వనున్నారు. ముఖ్యంగా పల్లెలను పట్టణాలను కలిపేందుకు కీలకమైన.. బ్రిడ్జిలు చాలాచోట్ల ధ్వంసమయ్యాయి. వీటికి తక్షణమే మరమ్మతులు అవసరం. వీటిని కూడా ప్రాధాన్యం జాబితాలో చేర్చారు.

జిల్లా	మొత్తం రోడ్లు (కి.మీ)	ధ్వంసమైన కి.మీ	నిధులు (రూ.లక్షల్లో)
కరీంనగర్	406.77	163.96	7306.70
జగిత్యాల	298.36	1.90	8000.00
పెద్దపల్లి	42.46	0.41	531.50
రాజన్నసిరిసిల్ల	121.43	7.43	3050.35
మొత్తం	869.01	173.70	రూ. 188.88



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

సమస్యలకు ప్రజావాణిలో పరిష్కారం

పెద్దపల్లి రూరల్: ప్రజా సమస్యలకు ప్రజావాణిలో పరిష్కారం దొరుకుతుందని, అధికారులు సకాలంలో స్పందించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఒకసారి ప్రజావాణికి వచ్చిన దరఖాస్తుదారులు మరోసారి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



బారులు తీరిన దరఖాస్తుదారులు

- ➔ రామగిరి మండలం బేగంపేటకు చెందిన కే.విజయ్‌కుమార్ తాము నలుగురు రైతులం కలిసి 2021లో 25కేవీ పవర్ కనెక్షన్ ట్రాన్స్‌ఫార్మర్‌కు దరఖాస్తు చేసుకున్నామని, ఇప్పటి వరకు రాలేదని, 25 కేవీ లైన్ క్యాన్సల్ చేసి, వ్యక్తిగత పవర్ కనెక్షన్ ఇప్పించాలని కోరారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈకి అధికారులు లేఖ రాశారు.
- ➔ పాలకుర్తి మండలం పుట్నూరు గ్రామానికి చెందిన పి.వెంకటేశ్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 250లో ఉన్న భూమి సరిహద్దులు నిర్ణయించే పంచనామా ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేసుకోగా.. ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్‌కు రాస్తూ త్వరితగతిన సమస్య పరిష్కరించాలని సూచించారు.
- ➔ గోదావరిఖని గంగానగర్‌కు చెందిన చల్లూరి ప్రసాద్ గంగానగర్ కాలనీలోని తన ఇంటి వెనుక ఖాళీ స్థలంలో గోడ నిర్మించుకున్నామని, ఆ గోడను తొలగించాలని తనపై ఒత్తిడి చేస్తున్నారని, స్థానిక కార్పొరేటర్ అండతో చేస్తున్నారని, న్యాయం చేయాలని కోరారు. వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకు నివేదిక సమర్పించాలని మున్సిపల్ కమిషనర్, ఏసీపీకి సూచించారు.
- ➔ జిల్లాకేంద్రానికి చెందిన కనకలక్ష్మి జిల్లా ఆవిర్భావం నుంచి మెప్మా ఆఫీసులో పనిచేస్తున్నానని, అనారోగ్యంతో ఐదు నెలలుగా విధులకు హాజరు కాలేదని, ప్రస్తుతం తనకు ఉపాధి కల్పించాలనిదరఖాస్తు చేసుకోగా మెప్మా పరిపాలనాధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



కేటీఆర్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా నేతలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులు చాలాకాలం తర్వాత ఒకేవేదిక మీదికి వచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో ఐటీ మినిస్టర్ కేటీఆర్‌ను కలిశారు. అభివృద్ధి పనులు, వివిధ అంశాలపై చర్చించారు. చిత్రంలో మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు సతీశ్ బాబు, సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, రమేశ్‌బాబు, దాసరి మనోహర్‌రెడ్డి, సంజయ్ కుమార్, కోరుకంటి చందర్, ఎమ్మెల్సీలు పాడి కౌశిక్ రెడ్డి, భానుప్రసాద్, రమణ తదితరులు ఉన్నారు. – సాక్షి ప్రతినిధి, కరీంనగర్

గద్దర్‌కు ఘన నివాళి



గోదావరిఖని: నివాళి అర్పిస్తున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని/సుల్తానాబాద్/పెద్దపల్లిరూరల్/మంథని/పాలకుర్తి: గద్దర్‌కు డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళి అర్పించారు. నాయకులు తాళ్లపెల్లి యుగేందర్, కాల్వ లింగస్వామి, రవికుమార్, గాదం విజయానందర్, మహంకాళి స్వామి, గడ్డం శేఖర్, వెంకటరమణ, గట్ల రమేశ్, దూళికట్ట సతీశ్ పాల్గొన్నారు. గద్దర్ మృతి తీరని లోటు అని బద్దం డానియల్ అన్నారు. గద్దర్ మరణం తీరని లోటు అని బ్లాక్ కాంగ్రెస్ చైర్మన్ దామోదర్ అన్నారు. సుల్తానాబాద్‌లోని నెహ్రూ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. మాజీ సర్పంచ్ ప్రకాశ్ రావు, నాయకులు బిరుదు కృష్ణ, దుగ్యాల సంతోష్‌రావు, రఫిక్, అమీనోద్దీన్, ఖలీమ్, శ్రీనివాస్ ఉన్నారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కన్వీనర్ గుమ్మడి కొముమరయ్య, కో–కన్వీనర్ గాండ్ల మల్లేశం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో నివాళి అర్పించారు. మంథనిలో మున్సిపల్ కౌన్సిలర్ పెండ్రు రమాదేవి, నాయకులు ఆజీంఖాన్, రవితేజ గౌడ్, మంథని సత్యం, అయేషా, ముస్కుల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కేశోరాం కాంట్రాక్ట్ కార్మికసంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య ఆధ్వర్యంలో కన్నాల టోల్‌ప్లాజా నుంచి బసంత్‌నగర్ బస్టాండ్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నాయకులు కాల్వ అంజయ్య, తలారి శంకర్, సంతపూరి కనుకయ్య, మహేందర్ పాల్గొన్నారు.



సుల్తానాబాద్: పూలమాల వేస్తున్న చైర్మన్ దామోదర్‌రావు

‘నేతన్నలను పట్టించుకోని కాంగ్రెస్’



మాట్లాడుతున్న మధు

మంథని: దేశం.. రాష్ట్రాన్ని ఏళ్ల తరబడి పాలించిన కాంగ్రెస్ నేత కార్మికులను ఏనాడూ పట్టించుకోలేదని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు విమర్శించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మంథనిలోని గాంధీచౌక్‌లో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. గతంలో చేనేత వృత్తిని ప్రోత్సహించకపోవడంతో నేతకార్మికుల బతుకులు ధ్వంసమయ్యాయని, తెలంగాణ వచ్చాక చేనేత రంగానికి పెద్దపీట వేశామని పేర్కొన్నారు. మహాదేవపూర్, మంథని మండలాలకు చెందిన చేనేత వృత్తిదారులను సన్మానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల రాంమూర్తి, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపద వనం స్థల పరిశీలన

- అభ్యంతరం తెలిపిన రైతులు
- పరిహారం పొందాక హక్కుండదన్న అదనపు కలెక్టర్



సంపదవనం స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

ధర్మారం: మండలంలోని మల్లాపూర్ శివారులో ఆదాయం ఇచ్చే మొక్కలు పెంచనున్న స్థలాన్ని సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరించిన స్థలంలో మొక్కలు నాటేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్న సమయంలో స్థానిక రైతులు మొక్కలు పెంచేందుకు అభ్యంతరం తెలిపారు. ఆ భూమికి ప్రభుత్వం పరిహారం చెల్లించిన తర్వాత రైతులకు సదరు భూమిలో సాగు చేసుకునే హక్కు ఉండదని అదనపు కలెక్టర్ సూచించారు. పంచాయతీకి ఆదాయం ఇచ్చే పండ్లమొక్కలుగానీ, టేకు మొక్కలుగానీ పెంచుతామన్నారు. గ్రామంలో చేపట్టిన సెగ్రిగేషన్ షెడ్, నర్సరీని సందర్శించి పలు సూచనలు చేశారు. సర్పంచ్ గంధం వరలక్ష్మి, డీఆర్‌డీవో పీడీ శ్రీధర్, ఎంపీడీవో జయశీల, అటవీ శాఖ రేంజ్ అధికారి రాఘవేందర్‌రావు, డిప్యూటీ రేంజ్ అధికారి స్వాతి, ఎంపీవో రమేశ్, ఇరిగేషన్ ఏఈ కార్తీక్, ఏపీవో రవీందర్ పాల్గొన్నారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..

- ప్రజల మద్దతు కూడగడుతున్నం
- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు
- బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు



కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న విజయరమణారావు

ఎలిగేడు: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతోందని, ఇందుకు ప్రజల మద్దతు కూడగడుతున్నామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని శివపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుల్తానాబాద్ మండలం కాట్నపల్లికి చెందిన వార్డు సభ్యులు గాదె రమాదేవి, మ్యాకల అనూష, సుంకిశాల తిరుపతిరావు, పబ్బతి మల్లారెడ్డి, తూడి రాజేశ్వరి, మాతంగి రాయమల్లు, పొన్నాల స్వరూప, శ్రీపతి కిరణ్, మరో 80మంది బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ అవినీతి పాలనను ప్రజలు గమనించారని, అందుకే కాంగ్రెస్‌పార్టీ పట్ల ఆకర్షితులవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ యూత్ కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మినుపాల ప్రకాశ్‌రావు, తిరుపతిరెడ్డి, గాదె సంపత్‌రెడ్డి, ఉపసర్పంచ్ శేఖర్‌గౌడ్ ఉన్నారు.

కనీస వేతనాలు అమలు చేయండి

పెద్దపల్లి రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన జీవో ప్రకారం వేతనాలు చెల్లించి వారి శ్రమను గౌరవించాలని విజయరమణారావు డిమాండ్ చేశారు. పంచాయతీ వర్కర్స్ యూనియన్ జేఏసీ చేపట్టిన సమ్మెకు మద్దతు ప్రకటించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఏలువాక రాజయ్య, మాజీ వైస్ చైర్మన్ నూగిల్లా మల్లయ్య, భూషనవేన సురేష్ గౌడ్ ఉన్నారు. అలాగే స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. స్వీపర్ల సమ్మెకు మద్దతు తెలిపారు. సీఐటీయూ జిల్లా నాయకురాలు జ్యోతి, తాండ్ర అంజయ్య, సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, లక్ష్మి, వెంకటి, చిన్న రాజయ్య, రాజయ్య, స్వామి, అనసూర్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలు సత్వరమే పూర్తి చేయాలి

- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మూడు వేల ఇళ్లు
- నోటరీ డాక్యుమెంట్‌పై విస్తృత ప్రచారం నిర్వహించాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ లక్ష్యాలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నత అధికారులు హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. హరితహారం, గృహలక్ష్మి, ఇళ్లపట్టాల పంపిణీ, జీఓ 59, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, బీసీ, మైనారిటీలకు ఆర్థిక సహాయం, గొర్రెల పంపిణీ, దళితబంధు వంటి పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా జిల్లాలో 2.2 లక్షల మొక్కలు నాటేందుకు స్థలం గుర్తింపు, గుంతల తవ్వకం చేపట్టాలని అన్నారు. సంపద వనాల కింద మొక్కలు నాటే ప్రక్రియ రెండు వారాల్లో పూర్తి చేయాలన్నారు. ప్రతి వారం 100 గొర్రెల యూనిట్ల గ్రౌండింగ్ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో గొర్రెల యూనిట్లను పంపిణీ చేయాలన్నారు. బీసీ కుల వృత్తులకు రూ.లక్ష ఆర్థిక సహాయానికి సంబంధించి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 300 మంది చొప్పున ఎంపిక చేసి లబ్ధిదారులకు ఈనెల 10లోపు చెక్కులు పంపిణీ పూర్తి చేయాలని తెలిపారు. గృహలక్ష్మి పథకం కింద తహసీల్దార్, మున్సిపల్, కలెక్టరేట్‌లో కౌంటర్లు ఏర్పాటు చేసి ఈనెల 10 వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని పేర్కొన్నారు. దళితబంధు రెండో దశ ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి 1100 మంది లబ్ధిదారులకు పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఓట్లు దండుకునే ప్రయత్నం



కార్మికులతో మాట్లాడుతున్న ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: అసెంబ్లీలో అవాస్తవాలు మాట్లాడి ఇక్కడి కార్మికులను మభ్యపెట్టి.. ఓట్లు దండుకోవాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చూశారని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాకూర్ విమర్శించారు. సోమవారం ఆర్జీ–1 పరిధిలోని జీడీకే–11గని వద్ద సింగరేణి కార్మికుల ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. సింగరేణి కార్మికుల కష్టార్జితంతోనే ఇక్కడ మెడికల్ కాలేజీ ప్రారంభమయ్యిందని, ఎమ్మెల్యే చేతకానితనంతో ప్రభుత్వం నుంచి నయాపైసా తీసుకురాలేకపోయారని పేర్కొన్నారు. దివంగత వైఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో సింగరేణి సంస్థ లాభాల్లో కొనసాగిందన్నారు. ఎంఎండీఆర్–2015 యాక్టు అమల్లోకి రావడానికి బీఆర్‌ఎస్ ఎంపీలే మద్దతు పలికారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కవ్వడం వల్లనే ఈరోజు సింగరేణి సంస్థలో ప్రైవేటీకరణ వైపు అడుగులు పడుతున్నాయన్నారు.

క్లుప్తంగా

రిటైర్డ్ కార్మికుడి ఆత్మహత్య


శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)

గోదావరిఖని(రామగుండం): స్థానిక గంగానగర్‌లో నివాసముంటున్న సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కేతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి(65) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. అప్పుల బాధ భరించలేక ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సౌజన్య తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా

పెద్దపల్లిరూరల్: విద్యుత్ చౌర్యం కేసులో నిందితుడికి పీఆర్ఎల్, జిల్లా సెషన్స్ జడ్జి హేమంత్‌కుమార్ జరిమానా విధించారు. సుల్తానాబాద్ మండలం సుభాష్‌నగర్‌కు చెందిన న్యాతరి శంకర్ 2016లో విద్యుత్ చౌర్యానికి పాల్పడగా నేరం అంగీకరించడంతో మొదటిసారి రూ.వెయ్యి జరిమాన విధించారు. 2017లో సైతం మళ్లీ విద్యుత్ చౌర్యం చేస్తూ పట్టుబడటంతో విజిలెన్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నిందితుడు నేరం ఒప్పుకోవడంతో రూ.9,842 జరిమానా లేదా మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పినట్లు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ విజిలెన్స్ కె.స్వామి, విజిలెన్స్ ఎస్సై నరేష్, సిబ్బంది తెలిపారు.

తప్పుడు వార్తలు నమ్మొద్దు

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలలో వందమంది విద్యార్థులకు కళ్ల కలక వచ్చిందంటూ ఆదివారం ఓ ప్రైవేట్ యాప్‌లో వచ్చిన వార్తా కథనం పూర్తిగా అవాస్తవమని ప్రిన్సిపాల్ మీర్జా సిరాజ్ బేగ్ తెలిపారు. ఆ తప్పుడు వార్తపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కళాశాలలో మొత్తం 80మంది విద్యార్థులకు ప్రస్తుతం 50మంది మాత్రమే ఉన్నారని, వారిలో ఇప్పటివరకు 20 మందికి కళ్ల కలక వచ్చిందని, విషయాన్ని వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి.. ఆదివారం 10మందిని ఇంటికి పంపించామని పేర్కొన్నారు. మరో ఐదుగురు ప్రత్యేక గదిలో ఐసోలేషన్‌లో ఉన్నారని పేర్కొన్నారు. కళాశాలలో కళ్ల కలకు సంబంధించిన అన్ని మందులు, డ్రాప్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బాలుడి మృతి

కమాన్‌పూర్(మంథని): మండలంలోని పేరపల్లికి చెందిన ఓ బాలుడు అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. బాలుడికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో తల్లిదండ్రులు వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే చనిపోయాడు. బాలుడికి మృతికి సదరు వైద్యుడే కారణమంటూ బంధువులు ఆందోళనకు సిద్ధమయ్యారని సమాచారం. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలం రామయ్యపల్లి గ్రామానికి చెందిన కొంతం రఘు(32) వ్యక్తిగత కారణాలతో ఆదివారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామస్తుల వివరాలు.. రఘు గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేశాడు. కొద్ది రోజుల నుంచి కుటుంబంలో గొడవలు జరుతుండగా పెద్దల సమక్షంలో పంచాయితీలు నిర్వహించారు. ఈ క్రమంలో రఘు పొలం వద్ద పురుగుల మందు తాగడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పేదింటి పిల్లలు.. ఖాకీ కొలువులు

- ఎస్సైగా ఉద్యోగం సాధించిన యువత


సాయికృష్ణ

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పేదింటి పిల్లలు ఖాకీ కొలువులు సాధించారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామపంచాయతీ పరిధి ఊశన్నపల్లె గ్రామానికి చెందిన మేడిద సాయికృష్ణ ఎస్సైగా ఎంపికయ్యాడు. సాయికృష్ణ తండ్రి మధు అనారోగ్యంతో మృతిచెందగా, తల్లి సంగీత కొడుకుతోపాటు కూతురు అంజలిని పెంచి పెద్ద చేసి ఉన్నత చదువులు చదివించింది. ఈసందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ, అన్నీ తానై విద్యాబుద్ధులు నేర్పించిన తల్లికి రుణపడి ఉంటానని, శిక్షణ పూర్తిచేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నాడు. సాయికృష్ణను ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, సర్పంచు కొనకటి మల్లారెడ్డి, ఎంపీటీసీ కదురు మానస, న్యాయవాదులు సరోత్తంరెడ్డి, సతీష్, మాజీ సర్పంచు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీలు బాలె మల్లీశ్వరి, ఈద రాజమ్మ, గ్రామస్తులు అభినందించారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..


తల్లిదండ్రులతో శ్రీకాంత్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎస్సై ఉద్యోగం సాధించాడు సుల్తానాబాద్ మండలం సాంబయ్యపల్లి గ్రా మానికి చెందిన లంకదాసరి శ్రీకాంత్. తండ్రి కొండయ్య ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ క్లర్క్‌గా, తల్లి అంగన్‌వాడీ హెల్పర్‌గా పనిచేస్తుంది. ప్ర స్తుతం శ్రీకాంత్ ఉస్మానియా యూనివర్సిటీలో లా మూడో సంవత్సరం చదువుతూనే ఎస్సైకి ప్రిపేర్ అయి ఉద్యోగం సాధించాడు. ఇతడి అన్న హైకోర్టులో న్యాయవాది. ఈసందర్భంగా శ్రీకాంత్‌ను గ్రామస్తులు అభినందించారు.

సత్తాచాటిన తాపీమేస్త్రీ కూతురు


మానస

ఓదెల(పెద్దపల్లి): పట్టుదల ఉంటే పేదరికాన్ని జయించి ఉద్యోగం సాధించవచ్చని నిరూపించింది మౌటం మానస. ఓదెల మండలం శానగొండ గ్రామానికి చెందిన మౌటం మానస ఎస్సై ఉద్యోగం సాధించింది. మౌటం సారయ్య, సారమ్మ తాపీమేస్త్రీ పనులు చేస్తూ చదివించారు. పదో తరగతి వరకు పొత్కపల్లి హైస్కూలు, ఇంటర్ ఓదెల ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ జమ్మికుంట గాయిత్రి కళాశాల, బీఈడీ హన్మకొండలో పూర్తి చేసింది. ఈసందర్భంగా మానస మాట్లాడుతూ, తన తల్లిదండ్రులకు, చదువునేర్పిన ఉపాధ్యాయులకు రుణపడి ఉంటానని, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తానని పేర్కొంది.

వ్యవసాయం చేస్తూనే ప్రిపరేషన్..


శ్రీనివాస్

మంథని: మంథని మండలం కన్నాల గ్రామపంచాయతీ పరిధి వేంపాడు గ్రామానికి చెందిన అడువాల శ్రీనివాస్ అగ్నిమాపక విభాగంలో ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. తల్లిదండ్రులు అడువాల మధునమ్మ–రాజేశంతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్తూనే గ్రూప్స్‌కు ప్రిపేరయ్యాడు. ఈ క్రమంలోనే ఎస్‌ఐ అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు. మంచి ఉద్యోగం సాధించి తల్లిదండ్రుల కష్టాలు తీర్చాలనే ఆకాంక్ష తనదని శ్రీనివాస్ తెలిపాడు.

సివిల్ ఎస్‌ఐగా అమూల్య


అమూల్య

గోదావరిఖని(రామగుండం): స్థానిక బాపూజీనగర్‌లో నివాసముంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన గైక్వాడ్ అమూల్య సివిల్ ఎస్‌ఐగా ఎంపికైంది. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో 235 మార్కులు సాధించింది. అమూల్య తల్లి సివిల్‌ఆసుపత్రిలోని శానిటేషన్ విభాగంలో కాంట్రాక్ట్ కార్మికురాలిగా, తండ్రి కూరగాయల మార్కెట్‌లో పనిచేస్తున్నారు. ఈసందర్భంగా అమూలయ్యను పలువురు అభినందించారు. బీటెక్ ఈఈఈ పూర్తి చేసిన తర్వాత ఎస్‌ఐ ఉద్యోగం కోసం కొద్ది రోజుల పాటు హైదరాబాద్‌లోని శిక్షణ పొందినట్లు అమూల్య తెలిపారు.

'రూ.లక్ష పథకం'లో గౌడ కులస్తులను చేర్చాలి


వినతిపత్రం అందజేస్తున్న గీతకార్మికులు

ఎలిగేడు(పెద్దపల్లి): రూ.లక్ష ఆర్థికసాయం పథకంలో గౌడ కులస్తులను చేర్చాలని గౌడ సంఘం నాయకులు ఏగోలపు సదయ్యగౌడ్, మోకు దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు అంజిగౌడ్ డిమాండ్ చేశారు. గీతకార్మికులపై సీఎం కేసీఆర్ సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని, వెంటనే జాబితాలోచేర్చాలని సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గౌడ సంఘం నాయకులు మధుర ఫంక్షన్‌హాల్ నుంచి బస్టాండు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, కార్యాలయం ఎదుట బైఠాయించారు. గౌడ కులస్తులను రూ.లక్ష సాయంలో చేర్చాలని నినాదాలు చేశారు. పథకంలో చేర్చకుంటే గౌడ సమాజం నుంచి ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ స్వర్ణకు వినతిపత్రం అందజేశారు. వేగోలపు శంకర్‌గౌడ్, పల్లెర్ల వెంకటేశ్‌గౌడ్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, చీకటి సంతోష్, పల్లెర్ల శారదగౌడ్, గడ్డం అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'రక్షణ చర్యలు లేకనే ప్రమాదాలు'

మంథని: మండలంలోని ఎక్లాస్‌పూర్ సమీపంలో గాడుదుల గండి ఘాట్‌పై సరైన రక్షణ చర్యలు లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. రెండురోజుల క్రితం ఘాట్‌పై జరిగిన ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించారు. కనీస సూచిక బోర్డులు, రేడియంతో కూడిన లైట్లు ఏర్పాటు చేయకోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అనేక మార్లు ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. కారు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన సంపత్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ల సందీప్, కేవీపీఎస్ నాయకులు మంథని లింగయ్య, బావు రవి తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్మికుల రాస్తారోకో


రాస్తారోకో చేపట్టిన సీఐటీయూ నాయకులు, కార్మికులు

పెద్దపల్లిరూరల్: వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులు జిల్లా కేంద్రంలోని రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 12,769 పంచాయతీల్లో 50 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనాలు అందించాలని, పర్మినెంట్ చేసి ప్రమాద బీమా రూ.10లక్షలు, సాధారణ బీమా రూ.5లక్షలు అందించాలన్నారు. ఈనెల 9, 10వ తేదీల్లో మహాపడావ్ నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు.

చేనేతబంధు ప్రకటించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: పద్మశాలీలకు చేనేతబంధు ప్రకటించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల రామ్మూర్తి కోరారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని గాంధీనగర్‌లోని చేనేత సహకార సంఘం వద్ద పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు యాదగిరి ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. జగిత్యాల జిల్లా కోరుట్లలో ఈనెల 13న నిర్వహించే సదస్సుకు కులబాంధవులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సాయిరి మహేందర్, వలస నీలయ్య, గుండ మురళి, సామల హరికృష్ణ, గాదాసు రవి, పేగడ పర్శ రాములు, సుంకె మహేశ్, సామల రాజేంద్ర ప్రసాద్, పెగడ చందు పాల్గొన్నారు.

ఐకమత్యంతో ముందుకు వెళ్లాలి

పద్మశాలీలు ఐకమత్యంగా ముందుకువెళితేనే రాజకీయంగా ఎదుగుతామని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జీ దాసరి ఉష అన్నారు. చేనేత దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం కానుకలు అందించారు.

స్వగ్రామం చేరిన గల్ఫ్ మృతదేహం


లక్ష్మణ్ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన వలసజీవి మృతదేహం స్వగ్రామం చేరింది. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన జక్కుల లచ్చవ్వ–భూమయ్య దంపతులకు ముగ్గురు కుమారులు. వీరికి వివాహాలు కావడంతో వేర్వేరుగా నివాసముంటున్నారు. రెండో కుమారుడు లక్ష్మణ్(40) పదేళ్లుగా దుబాయ్‌కు వెళ్తున్నాడు. మూడేళ్ల క్రితం ఇంటికి వచ్చి అప్పు చేసి ఇల్లు కట్టాడు. మళ్లీ దుబాయికి వెళ్లి ఓ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తక్కువ వేతనం రావడంతో అప్పులెట్లా తీర్చాలన్న బెంగతో జూలై 31న తన రూంలో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తోటిమిత్రుల సహకారంతో ఆదివారం రాత్రి గల్ఫ్ నుంచి శవపేటిక ఇంటికి చేరింది. సోమవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య శకుంతల, కుమారుడు మల్లికార్జున్ ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ కేతిరెడ్డి అరుణ కోరారు.

బొగ్గుబాయి వార్తలు

ఉత్పత్తికి ఆటంకం లేకుండా చూసుకోవాలి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న చింతల శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): భూగర్భ గనుల్లో యంత్రాల విడిభాగాలు కొనుగోలు చేసి ఉత్పత్తికి ఆటంకం లేకుండా చూసుకోవాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. యంత్రాలకు సంబంధించి స్పేర్ పార్ట్స్ కొనుగోలు, గనుల్లో అవసరమైన విడిభాగాల ఏర్పాటుపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. గనుల్లోని స్టోర్స్‌ల్లో అవసరమైన అన్నిరకాల యంత్ర విడి భాగాలు, యంత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు అవసరమైనవి తెప్పించుకోవాలని పేర్కొన్నారు. ఉత్పత్తికి అంతరాయం కలగకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎస్ఓటూ జీఎం రామ్మోహన్, ఏరియా ఇన్‌చార్జి ఇంజినీర్ మదన్‌మోహన్, స్టోర్స్ ఇన్‌చార్జి ప్రసాద్, ఐఈడీ డీజీఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇంటి స్థలం కేటాయించాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య


సమావేశంలో మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మికులకు రెండు గుంటల ఇంటి స్థలాన్ని కేటాయించి, నిర్మాణం కోసం రూ.50లక్షలు వడ్డీలేని రుణం అందించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విశ్వహిందూ పరిషత్‌కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. సింగరేణికి 1,467 ఎకరాల ఖాళీ భూములు, ఖాళీ అయిన క్వార్టర్లు ఉన్నాయన్నారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు, కాంట్రాక్టు కార్మికులకు ఖాళీ క్వార్టర్లను కేటాయించాలన్నారు. సింగరేణి నిధులతో నిర్మించిన వైద్య కళాశాలలో 50శాతం సీట్లు కార్మికుల పిల్లలకు ఇవ్వాలని పేర్కొన్నారు. అన్ని గనుల్లో ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన నీరు అందించాలని, కాంట్రాక్టు కార్మికులకు ఎల్ఆర్ఎస్ బోనస్, సామాజిక భద్రత కల్పించాలన్నారు. జైపూర్ సోలార్ ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులుగా స్థానికులను అవకాశం కల్పించాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం అన్ని జీఎం కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అనంతరం హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద ఆందోళన నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో నాయకులు మండ రమాకాంత్, పులి రాజారెడ్డి, మాధవ్‌నాయక్, పవన్‌కుమార్, రమేష్, సీహెచ్ రమేష్, 11ఏరియాల నాయకులు పాల్గొన్నారు.

సింగరేణి అధికారి తీరుపై శివాలెత్తిన మహిళ!?

గోదావరిఖని(రామగుండం): రామగుండం రీజియన్‌లోని ఓ డివిజన్‌లో పనిచేస్తున్న సింగరేణి అధికారి తీరుపై ఓ మహిళ చిందులేసింది. తనను శారీరకంగా వాడుకుని మోసం చేశావంటూ గెస్ట్‌హౌజ్‌లోని భోజనం హాల్‌లోకి వెళ్లి అక్కడ ఉన్న అధికారిపై శివాలెత్తింది. ఇన్నాళ్లు శారీరకంగా వాడుకున్న తనను పెళ్లి చేసుకోవాలని నిలదీసింది. తనకు ఇప్పటికే పెళ్లి అయ్యిందని, పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదని చెప్పడంతో ఆమె ఆగ్రహానికి గురైనట్లుగా తెలుస్తోంది. ఇద్దరూ కొంత సేపు మాట్లాడుకున్నట్లు, సెల్ఫీ తీసుకునేందుకు ఆ మహిళ ప్రయత్నించగా అధికారి సెల్‌ఫోన్‌ను దూరంగా విసిరికొట్టినట్లు తెలుస్తోంది. ఇలా కొంతసేపు వారు వాగ్వాదానికి దిగగా, అక్కడ ఉన్న మహిళలు వారిని దూరంగా పంపించినట్లు సమాచారం. అయితే ఈవిషయమంతా భోజనం హాల్‌లో ఉన్న సీసీ పుటేజీలో నమోదైనట్లు తెలిసింది. దీనిపై ఉన్నతాధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

కనీస వేతనం అమలు చేయాలి

జ్యోతినగర్(రామగుండం): అసంఘటితరంగ కార్మికులు కనీస వేతనం జీవో ప్రకారం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర కార్మిక ఉద్యోగ సంఘాల పిలుపులో భాగంగా ఈ నెల 9,10 తేదీల్లో నిర్వహించే మహాపడావ్ (మహాధర్నా) విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ఉన్న అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతన జీవోల కాలపరిమితి ముగిసినా కేంద్ర ప్రభుత్వం జీవోలను సవరించలేదని, నిత్యావసర సరుకుల ధరలు మాత్రం విపరీతంగా పెంచేశారని ఆరోపించారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, కార్మిక చట్టాలను మారుస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి, యాజమాన్యాలకు కార్మికులను కట్టు బానిసలుగా చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు రామాచారి, దండ రాఘవరెడ్డి, యాకూబ్, కాదశి మల్లేష్, షమీం, చంద్రమౌళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'గుడిసెలను తగలబెట్టడం హేయమైన చర్య'

జ్యోతినగర్(రామగుండం): భూ పోరాట కేంద్రంలో ఏర్పాటు చేసుకున్న నిరుపేదల గుడిసెలు తగులబెట్టడం హేయమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వేల్పుల కుమారస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రామగుండం కార్పొరేషన్ ఐదవ, మూడో డివిజన్‌ను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో పేదలు ఇండ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకోగా, అందులో కొన్నింటిని మల్కాపూర్‌కు చెందిన కొందరు తగులబెట్టారని ఆరోపించారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం రెండో డివిజన్ కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి, రామాచారి, నాంసాని శంకర్, బిక్షపతి, సాగర్, కృష్ణ, సురేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రామగుండం: గోదావరిఖనిలో ఈనెల 11న నిర్వహించే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ రామగుండం నియోజకవర్గ సదస్సును జయప్రదం చేయాలని ఎంఎస్పీ జిల్లా ప్రతినిధి కొండల రాజేందర్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక రైల్వేస్టేషన్ ఏరియా అక్బర్‌నగర్‌లో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సదస్సులో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు మాదిగ, ఉప కులాలకు జరుగుతున్న అన్యాయాలు, చట్టసభల్లో ఎస్సీల జనాభాకు తగిన ప్రాధాన్యం తదితర అంశాలను తీర్మాణించనున్నట్లు పేర్కొన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో మంద రవికుమార్, గుండ్ల రాకేష్, కాసిపేట రాజయ్య, ఉప్పులేటి శ్రీనివాస్, కాంపెల్లి శ్రీనివాస్, మల్లికార్జున్, ప్రవీణ్, రిజ్వాన్, కుమార్, సాయి, ముత్తు, వివేక్, శివ, రామ్మూర్తి పాల్గొన్నారు.

వాగులో ఆటోబోల్తా.. డ్రైవర్ సురక్షితం

శంకరపట్నం: మండలంలోని అర్కండ్ల లో లెవల్ బ్రిడ్జిపై అదుపుతప్పిన ఆటో వాగులో బోల్తాపడింది. గ్రామస్తుల వివరాలు.. వీణవంక మండలం గంగారంకు చెందిన ఆటోడ్రైవర్ రాజు మండలంలోని కన్నాపూర్‌లో ప్రయాణికులను దింపి స్వ గ్రామం వెళ్తున్నాడు. శంకరపట్నం మండలం అర్కండ్లవాగుపై ఉన్న లోలెవల్‌బ్రిడ్జిపై ఆటో అదుపుతప్పి వాగులో పడింది. డ్రైవర్ రాజు ఒక్కడే ఉండడంతో ఈత కొట్టుకుంటూ ఒడ్డుకు చేరాడు. అర్కండ్ల గ్రామస్తులు వాగు నుంచి ఆటోను బయటకు తీశారు.


సమ్మేళనంలో రామగుండం జెడ్పీ స్కూల్ పూర్వ విద్యార్థులు


కమాన్‌పూర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అపూర్వం.. అమోఘం

కమాన్‌పూర్/రామగుండం/జ్యోతినగర్:అపూర్వం..అహోఘం అనే విధంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కమాన్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1998–99లో పదో తరగతి చదివిన విద్యార్థులు, రామగుండం పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2001–2002లో పదో తరగతి బ్యాచ్, రామగుండం అన్నపూర్ణ కాలనీలోని విశ్వభారతి హైస్కూల్‌లో 2002–03లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు సోమవారం సమ్మేళనం నిర్వహించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు బంధారపు తిరుపతి గౌడ్, దుర్గ, పద్మ, సంధ్యం, శంకర్, సీతారాం, కన్నూరి లక్ష్మణ్‌రావు, లక్ష్మీ, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు కొయ్యడ శేఖర్, లవకుమార్, భరత్, రాము, నరేశ్, సదానందం, శ్రీనివాస్, నారాయణ, యాసిన్, ఆసిఫ్, స్రవంతి, సంతోష్, మహేందర్ రెడ్డి, జ్యోతి, కవిత తదితరులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో విశ్వభారతి పూర్వ విద్యార్థులు